# అశ్రువర్షం

శ్రీ శ్రీనివాసపుపురం రామాచార్యులు

ఆరోజుదీపావళి! ఎక్కడచూచినా ఆనందం నృత్యం చేస్తోంది!! వేకువఝామునుంచీ, పిల్లలు కాల్చుతున్న పలువిధాలైన టపాకాయల ధ్వనులు, ప్రపంచ యుద్ధంలోని–బాంబులు; మరఫిరంగుల్లా, గాలినిచీల్చుకుని దిగంతాలవరకూ వ్యాపిస్తున్నాయ్! చీకటిపడేవరకూ ఓపికపట్టలేక, మధ్య మధ్య– చిచ్చుబుడ్లు; కాకర పువ్వొత్తులు; మతాబాలు వగైరాలు వెలిగిస్తున్నారు. అరుణ కాంతిలో వాటి వెలుగులు అస్పష్టంగా అపుపిస్తున్నాయ్! ముత్యాల రంగవల్లుల ముంగిళులతో, వీధులు వింతకళలు తేరుతున్నాయ్! పిల్లల సంతోషానికి అంతులేదు! అసలు వాళ్ళదేగా! ఆపండుగంతా! వారి అమాయకపు ఆనందమే ఆపండుగ.

తమ జీవితాల్ని దరిద్రదేవత కంకితము చేసిన దీన బిక్షువులుగూడా ఆరోజు కడుపునిండుగా అన్నందొరుకుతుందన్న ఆశతో ఆనందాన్ని ప్రకటిస్తున్నారు.

కానీ ఆ ఆనంద మనుభవించే భాగ్యం ఆనాడు ఒక జీవి మాత్రంనోచుకోలేదు! ఆ జీవి చంద్రమ్మ .... - ఆమె హృదయంలో వేదనాగ్ని రగులుతూ- రాజుతూవుంది. భరింపరాని ఆవేదనకు రక్తనాళాల్లోని రక్తం ఒక్కసారివేడెక్కి, విద్యుత్ప్రవాహంలా శరీరంయావత్తు ప్రవహించ సాగింది. ఆరోజు చంద్రమ్మ యమయాతన అనుభవిస్తోంది! ఆమె కన్నులకు అంధకార మలుముకుపోయినట్టు కన్పించింది.

ఆమె తన బాధను ఎవరితోనైనా చెప్పి ఒక్కమారు గట్టిగా యేడిస్తే, కన్నీళ్ళతో సహా ఆబాధ కొట్టుకుపోయి హృదయం తేలిక పడుతుందనుకుంది. కాని యేడ్వటానికి కంటిలో తడిలేదు! ఈనాటికి అవియెండి పోయి సంవత్సరమైంది.

టపాకాయల ధ్వనులు చెవుల్లోదూరి గింగుర్లెత్తిస్తూనే వున్నాయ్! పిల్లలు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు. ఇంకొందరుపిల్లలు కుక్కతోకకు చిన్నటపాకాయలసరాలు కట్టి; అంటించి వదిలేస్తున్నారు! ఉండుండి, ఆ టపాకాయలుఒక్కొక్క పేలినప్పుడు కుక్క 'కంయ్' మంటూ తోకవిదిలించుకునిపారిపోతోంది. పిల్లలుఅరుస్తూ రొజుతూ దానివెనకాలే పడి దాన్ని గాభరాపట్టిస్తున్నారు. చంద్రమ్మ ఈ దృశ్యాల్నిచూచి కుమిలి కుమిలియేడ్చి, తన పాపిష్టి కన్నులతో ఇక ఆపిల్లల ఆనందాన్ని చూడలేక ముఖాన్ని చేతులతో కప్పుకుని తలొంచుకుంది.

క్రిందటి సంవత్సరం చంద్రమ్మ దీపావళీ పండుగ త్వరలోనే వచ్చేస్తూవుందన్న సంబరంతో వారం రోజులు ముందునుంచీ- ఇల్లూ, వాకిలీ చక్క బెట్టుకునే పనుల్లో మునిగివుంది తను, తనభర్త, తనమురళి యీతూరి పండుగకు గొప్పగా స్వాగతమివ్వాలనీ, ఆరోజంతాహాయిగా ఆనందంగా గడిపేయాలని అనుకుంటోంది ఇంతలో–

"అమ్మా! తపాకాయలు లామిగాడు తెత్తుకున్నాడు. నాకుగూలా తెత్తియివ్వవూ?" అంటూ, బయటనుంచీ వొచ్చి తల్లికొంగు పట్టుకులాగుతూ అడిగాడు, ఐదేళ్ళ కొడుకు మురళి, సగం వచ్చీరాని మాటలతో.

"ఇప్పుడే యెందుకు బాబూ! దీపావళి యింకా వారం రోజులుందిగా?" బుజ్జగించింది తల్లి!

"ఇప్పులే కావాలి అమ్మా!" లామిగాణ్ణి అడిగితే ఘోలా! అన్నాడు! నాకు తెత్తియివ్వవూ? నేను కాల్తుకోవాలి!" అని అడిగాడు మళ్ళీ, తల్లి కొంగు లాగుతూ గోముగా!

"సాయంత్రం మీనాన్న ఆఫీసునుంచి రాగానే తెమ్మంటానులే! బాబూ ఇప్పుడు నేనెక్కడికిపోను చెప్పు మీ నాన్న వచ్చేలోగా బువ్వ వేయాలి! కొంగువొదిలిపెట్టు బాబూ! మానాన్నకదూ!.

ససేమిరా వాడు వినలేదు! పైగా తల్లికొంగు యింకా బలంగా లాగుతూ "ఇప్పులే కావాలి ఇప్పులే కావాలి"! అని మొండిపట్టు పట్టాడు.

"ఆలాగే! యిప్పుడే తెమ్మంటాను. మీ నాన్నవచ్చేవరకూ కాస్తవోపిక పట్టుబాబూ!" అంది తల్లి వాడితల నిమురుతూ.

"ఉహూ నాన్నొత్తేవలకూ వుండను నువ్వే తీతుకులా!" అని మారాం చేయసాగాడు

వాణ్ణి సముదాయించటం ఆమెకు తలకు మించిన పనైంది. ఏమేమో చెప్పిచూచింది. చివరికి వినకపోయేప్పటికి కోపంవచ్చి నాలుగు తగిలించింది. మురళి గుక్కపట్టి యేడుస్తూ అలానే తల్లి ఒడిలోపడి నిద్రపోయాడు. "అయ్యో! కోపంవచ్చి పిల్లాణ్ణికొట్టానే!" అని పశ్చాత్తాపపడింది చంద్రమ్మ ఆమె శరీరానికేదో వేడిగా తగిలినట్టయింది మురళినుదుటిమీద చేయివేసిచూచింది. నుదురు కాలి పోతోంది ఆమె గాభర పడసాగింది. రెండు రోజుల్నించీ కొద్దిగా వస్తూన్నజ్వరం యీరోజు ఎక్కువైంది. పిల్లాణ్ణి మెల్లిగాఎత్తుకెళ్ళి పరుపుమీద పడుకోబెట్టి దుప్పటి కప్పింది. వాడికి జ్వరం తగుల్తూన్న సంగతే మరచిపోయింది. తనుకొట్టినందుకే భయపడిమళ్ళీ యీ జర్వం తగిలిందేమోనని బాధ పడసాగింది.

భావనారాయణ ఆఫీసునుంచి వచ్చాడు. బట్టలుగూడా మార్చక మునుపే "చంద్రా! చంటివాడెక్కడ? కన బడ లేదే: ఆడుకోటానికెళ్ళాడా? వాడికీపూట యెలావుంది?? జ్వరం తగుటలేదుకదా?" అనిప్రశ్నలవర్షం కురిపించాడు.

జరిగిన విషయం చెప్పి చంద్రమ్మ కళ్ళల్లో నీళ్ళు పెట్టుకుంది.

"ఏవిటిచేశావే చంద్రా! వాణ్ణిసముదాయించటం నీచేత కాలేదూ? అని గబ, గబా గదిలోకి వెళ్ళాడు. ?"

"ఏమండీ! ఎక్కువగానే కాస్తోందా జ్వరం?" భర్త వెనకాలే వచ్చి అడిగింది చంద్రమ్మ.

"ఎక్కువగానే కాస్తోంది. ఒకసారి వెళ్ళి శేషాచలం గారిని పిల్చుకువస్తాను.

డాక్టరు శేషాచలం పిల్లాణ్ణి పరీక్షచేశాడు.

"అబ్బే! ఏమిలేదు కొద్దిగా జ్వరం కాస్తూ వుంది. మరేం భయపడవలసిన పనిలేదు. మందు యిస్తాను." అని డాక్టరు వెంటతెచ్చిన మందు ఏదో యిచ్చాడు.

ఐదు రోజులు గడిచి పోయాయి రోజు రోజుకు మురళికి జ్వరతీవ్రత యెక్కువౌతోంది. కాని, తగ్గట లేదు! ప్రతిరోజూ డాక్టరు మందులిస్తూనే వున్నాడు. చంద్రమ్మ మురళి మంచం వదలి ఒక్క క్షణమైనా ఉండలేక పోతోంది "బాబూ! ఎలావుందీ?" అని ప్రతినిమిషానికీ అతని నుదుటిపైన చేయిపెట్టి అడుగుతుంది దానికి జవాబుగా మురళి పిచ్చిచూపులు చూచి ఊరుకుంటాడు

ఆ రోజు సాయంత్రం యింటికొస్తూనే, మురళి మంచంవద్దకెళ్ళి "ఏంబాబు! ఎలావుందీ?" అన్నాడు. భావనారాయణ.

"నాకు తపాకాయలు కావాలినాన్నా."

"ఈ ఒక్క రోజు ఓపిక పట్టుబాబు! నీకు కొత్త చొక్కా — లాగూ, టపాకాయలు, కాకరపువ్వొత్తులు, మతాబాలు, అన్నీ తెచ్చియిస్తాను" అని అన్నాడు.

మురళి తిరిగి ఏమీ మాట్లాడలేదు.

"అ...మ్మా!" — అని మూల్గాడు. మురళి.

"భర్తకు అన్నం వడ్డిస్తూన్న చంద్రమ్మ పరుగెత్తుకొచ్చి—"ఏంబాబు?" అంది.

"నాకు తపాకాయలు కావాలే!....

"ఊరికే మాట్లాడితే ఆయాసం ఎక్కువౌతుంది బాబు! .... రేపు మీ నాన్నను తెచ్చి యివ్వమంటానులే"—

"నువ్వు ఊలికేనే చెబుతున్నావ్! అన్నీ అబద్దాలే."

"లేదు బాబు! తప్పక రేపు తెమ్మంటాను"

ఆ మర్నాడు మురళికి జ్వరంతీవ్రంగా తగిలింది. మతిస్పృహలోలేడు. ఆయాసం యెక్కువైంది. బాధగా మూల్గుతున్నాడు. "అమ్మా! ... తపాకాయలు ... తెమ్మని....నాన్నకు....చెప్పవూ?....ఫో....ఫో...నువ్వు యెప్పు....డూ....ఇం...తే" —అని పలవరిస్తున్నాడు. డాక్టరు వచ్చాడు. మురళిని పరీక్షచేశాడు.

మురళి పరిస్థితి నిమిష నిమిషానికీ, మరీ యెక్కువౌతోంది. మందులు—మాకులు ఏంపని చెయ్యలేదు! మూల్గులు, పలవరింతలు యెక్కువౌతున్నాయి. కాళ్ళు, చేతులు చల్లబడి పోతున్నాయి! చంద్రమ్మకు, భావనారాణయకు కంగారెక్కువైంది.

"అ....మ్మా! త పా కా"— అంటూ, మురళి శాశ్వతంగా కన్ను మూశాడు. చంద్రమ్మ, భావనారాయణ అతనిపైబడి గొల్లుమన్నారు.

వాళ్ళకి తరవాత ప్రతీ దీపావళీ అంధకారమే. పాట కాయ ప్రేలినప్పుడల్లా వాళ్ళ గుండెలు బ్రద్దలౌతాయి.